www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 24 మే 2023

5

పశ్చిమ గోదావరి

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని 19వ వార్డులో రూ.15 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ భవనానికి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయానికీ రూ.20 లక్షల నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు చిన్న చిన్న శుభకార్యాలను ఈ కమ్యూనిటీ భవనాల్లో నిర్వహించుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలోని సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇవ్వడమే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యోద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంక టరమణ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, వైస్ ఛైర్ పర్సన్ కామన నాగిని పాల్గొన్నారు.

చెరువుల జాతర..!

కొల్లేరులో నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువుల తవ్వకాలకు రంగం సిద్ధమైందా... ప్రతి గ్రామంలోనూ వంద ఎకరాల్లో చేపల చెరువులు తవ్వేందుకు ప్రణాళికలు తయారయ్యాయా.. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధి కనుసన్నల్లో ఇదంతా సాగుతుందా.. అంటే అవుననే సమాధానం వస్తోంది. కొల్లేరుతో మిళితమైన నాలుగు నియోజకవర్గాల్లోనూ మొత్తంగా ఏడు వేల ఎకరాల్లో చేపల చెరువుల తవ్వకాలకు ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. ఇటీవల కొన్నిచోట్ల తవ్వకాలు ప్రారంభించినా మీడియాలో కథనాలు రావడంతో తాత్కాలికంగా వెనక్కితగ్గారు. ఇదంతా ఫారెస్ట్ అధికారుల కనుసన్నల్లోనే సాగుతుండటం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. వారం రోజుల్లో తవ్వకాలు ప్రారంభించి ముందుకు సాగేందుకు రెడీ అవుతున్నట్లు సమాచారం.

కొల్లేరులో అక్రమ చేపల చెరువుల తవ్వకాలకు రంగం సిద్ధం

ఏడు వేల ఎకరాల్లో చెరువులు తవ్వాలని ప్రణాళికలు

కొల్లేరుతో మిళితమైన నాలుగు నియోజకవర్గాల్లో అమలు

కొన్నిచోట్ల తవ్వకాలు ప్రారంభం.. జనాల్లో అలజడితో వెనక్కి

వారం రోజుల్లో మళ్లీ తవ్వకాలకు కసరత్తు

నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే అంతా

'జీ.. హుజూర్' అంటూ సలాం కొడుతున్న ఫారెస్ట్ అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరు అభయారణ్యం మళ్లీ అన్యాక్రాంతమవుతున్న పరిస్థితి నెలకొంది. కాంటూరుతో సంబంధం లేకుండా బడాబాబులంతా ఏకమై కొల్లేరులో చేపల చెరువుల తవ్వకాలకు సిద్ధమయ్యారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతున్న పరిస్థితి ఉంది. కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధి కనుసన్నల్లో చేపల చెరువుల తవ్వకాల వ్యవహారం సాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. జిల్లాల విభజన జరిగిన తర్వాత కొల్లేరుతో మిళితమైన కైకలూరు, ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు నియోజకవర్గాలు ఏలూరు జిల్లాలోకి చేరాయి. గడిచిన కొంతకాలంగా నిడమర్రు, దెందులూరు, ఏలూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో అక్రమంగా చేపల చెరువుల తవ్వకాలు సాగుతూనే ఉన్నాయి. ఇప్పుడు ఏకంగా బరితెగించినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది కొల్లేరును మొత్తం ఒకేసారిగా చేపల చెరువులుగా మార్చేందుకు నాలుగు నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులంతా కలిసి మాస్టర్‌ప్లాన్ రూపొందించినట్లు ప్రచారం సాగుతోంది. కైకలూరు, మండవల్లిలో 18 గ్రామాలు వరకూ ఉండగా ప్రతి గ్రామంలోనూ వందెకరాల్లో చేపల చెరువులు తవ్వేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. మిగిలిన మండలాల్లోనూ ఇదేవిధంగా కొనసాగించాలని వ్యూహాలు రచించినట్లు చెబుతున్నారు. ఇప్పటికే ప్రత్తికోళ్లలంకలో 262 ఎకరాలను చేపల చెరువులుగా మార్చేసినట్లు చెబుతున్న పరిస్థితి ఉంది. ఈ విధంగా కొల్లేరుతో మిళితమైన నాలుగు నియోజకవర్గాల్లోనూ ఏడు వేలకుపైగా ఎకరాలను చేపల చెరువులుగా మార్చాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. దీనికోసం పెద్దఎత్తున డబ్బు వెదజల్లుతున్నట్లు సమాచారం. ఫారెస్ట్ అధికారులకు పెద్దఎత్తున మామూళ్లు అందించినట్లు చెబుతున్నారు. కొల్లేరును కంటికి రెప్పలా కాపాడాల్సిన ఫారెస్ట్ అధికారులే అక్రమార్కులతో చేతులు కలిపి ధ్వంసం చేస్తున్న పరిస్థితి ఉంది. రాష్ట్రస్థాయిలో చక్రం తిప్పడంతో జిల్లాలోని అధికారులు మౌనం వహించి కొల్లేరులో చేపల చెరువుల తవ్వకాలను పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఈ చేపల చెరువుల తవ్వకాలతో కొల్లేరు మొత్తం మరోసారి పెద్దఎత్తున ఆక్రమణలకు గురికానుంది.

తాత్కాలిక విరామమే.. ముందుంది చెరువుల జాతర

కొల్లేరులో చేపల చెరువుల తవ్వకాలను కొద్దిరోజుల క్రితం ప్రారంభించారు. కైకలూరు మండలం పందిరిపల్లి, నిడమర్రు మండలంలో ఈ తవ్వకాలు సాగాయి. మీడియాలో కథనాలు రావడంతో తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు తెలుస్తోంది. అంతా సద్దుమణిగిన తర్వాత వారం రోజుల్లో మళ్లీ చేపల చెరువుల తవ్వకాలు ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే వారం, పది రోజుల్లో కొల్లేరులో చేపల చెరువుల తవ్వకాలు జాతరను తలపించేలా సాగనున్నాయి. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో జిరాయతీ భూముల్లో చెరువులను సైతం అప్పటి ప్రభుత్వం ధ్వంసం చేసింది. దాదాపు పది వేల ఎకరాల జిరాయతీ భూమిని రైతులు కోల్పోయినట్లు అంచనా వేశారు. భూసర్వే నిర్వహించి జిరాయతీ భూములను రైతులకు అప్పగించాలని ఎప్పటి నుంచో అంతా కోరుతున్నారు. ఆ ప్రక్రియ పూర్తి చేయకుండా బడాబాబులు అక్రమంగా చేపడుతున్న చేపల చెరువుల తవ్వకాలతో అక్కడి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుండటంతో అధికారులు పూర్తిగా చేతులెత్తేసిన పరిస్థితి నెలకొంది. కొల్లేరులో అక్రమ చేపల చెరువుల తవ్వకాలను అడ్డుకుంటారా.. లేక చేతులెత్తేశారో చూడాల్సి ఉంది.

గోదావరి ఏటిగట్టు వద్ద రోదిస్తున్న బంధువులు

కూలీల బతుకులు.. గోదారమ్మ పాలు

భీమలాపురం వద్ద పడవ బోల్తా : ఇద్దరు కూలీలు దుర్మరణం

ప్రజాశక్తి - ఆచంట

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి, అధికారులు

నిత్యం పొట్ట కూటి కోసం తప్పని ఫీట్లు.. గోదారమ్మే తమను కాపాడుతుందనే ధీమాతో ఆ కూలీలు తమ కుటుంబాల కడుపు నింపుకునేందుకు పనికెళ్లిన సందర్భంలో చోటుచేసుకున్న ప్రమాదంతో ఇద్దరు ప్రాణాలు నీళ్ల పాలయ్యాయి. ఒక కుటుంబానికి పెద్ద దిక్కు కోల్పోగా.. నా అనే వారు లేక తన భర్తే సర్వస్వంగా బతుకుతున్న గృహిణిని ఈ ప్రమాదం ఒంటరిగా నడిరోడ్డుపై నిలబెట్టింది. ఇదీ ఆచంట మండలం భీమలాపురం సమీపంలో గోదావరిలో చోటుచేసుకున్న పడవ ప్రమాదంలో మృతుల కుటుంబాల రోదన.

భీమలాపురం నుంచి ఉదయం 8.30 గంటలకు ఇంజిన్ పడవపై పడవ నడిపే వ్యక్తితో సహా మొత్తం ఆరుగురు మధ్యలంక వెళ్లారు. అక్కడ కొబ్బరికాయల లోడు వేసుకుని పది గంటల ప్రాంతంలో భీమలాపురం రేవుకు బయల్దేరారు. ఐదు కిలోమీటర్ల దూరమే కావడం, ప్రయాణం సాఫీగా సాగుతుండటంతో గోదావరి గాలికి కబుర్లు చెప్పుకుంటున్నారు. అయితే ఈ లోపు పడవలోకి నీరు రావడం ప్రారంభమైంది. దీంతో ఎందుకైనా మంచిదని మరో పడవ తీసుకొస్తానంటూ ఈతొచ్చిన ఒకరు గోదావరిలోకి దూకి ఒడ్డుకు బయల్దేరారు. అదే సమయంలో కంగారుపడిన మిగిలిన వారు పడవలో ఒకవైపునకు రావడం, కొబ్బరికాయల లోడు ఎక్కువగా ఉండటంతో పడవ బోల్తా పడింది. భీమలాపురానికి చెందిన కొబ్బరి రైతు దేవి నాగరాజు, పడవ నడిపే కడలి బుల్లబ్బులు, కూలీలు జడ్డు సత్యనారాయణ, తాడికొండ సాంబశివరావు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. అయితే ఈత రాని వల్లూరు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ కుడిపూడి పెద్దిరాజు (60), యలమంచిలి మండలం దొడ్డిపట్లకు చెందిన సిరగం వెంకటరమణ (45) గల్లంతయ్యారు. ప్రమాదం విషయం తెలియగానే స్థానికులు, అధికారులు గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం సమయానికి ప్రమాద స్థలికి సమీపంలోనే ఇరువురి మృతదేహాలు లభ్యమయ్యాయి. దీంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పెద్దిరాజుకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంకటరమణ భార్య మాత్రమే ఉంది. పిల్లలు, బంధువులు లేకపోవడంతో ఈ జంట ఒంటరిగా దొడ్డిపట్లలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. మృతదేహాలను పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సంఘటనా స్థలాన్ని నరసాపురం డిఎస్‌పి మనోహరాచారి, పాలకొల్లు సిఐ కొండవీటి శ్రీనివాస్, ఆచంట, పోడూరు, పెనుగొండ ఎస్‌ఐలు, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, ఆర్‌ఐ జయలలిత, ఎఎంసి ఛైర్మన్ లావణ్య, సర్పంచి గుబ్బల మాధవరావు సందర్శించారు.

చెట్ల నీడ.. తెచ్చుకున్న నీరే దిక్కు

పాలకోడేరు: నినదిస్తున్న ఉపాధి కూలీలు, నేతలు

ఉపాధి పనుల సందర్శనలో నేతల వద్ద కూలీల ఆవేదన

ప్రజాశక్తి - పాలకోడేరు

చెట్ల నీడ.. వెంట తెచ్చుకున్న తాగునీరు తప్ప ఉపాధి పనుల ప్రదేశాల్లో ఎటువంటి సౌకర్యాలూ లేవని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఆవేదన వ్యక్తం చేశారు. పాలకోడేరులో ఉపాధి హామీ పనుల ప్రదేశాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బలరాం మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మందు తాగిన మందుబాబులు సీసాలు పంట, మురుగుకాల్వల్లో పడేయడంతో కూలీలు గాయాల పాలవుతున్నారన్నారు. ఒకపక్క ప్రమాదకరమైన ప్రాంతాల్లో పనులు చేస్తున్నా కొంతమంది కూలీలు పని చేయట్లేదనే ప్రచారం సరికాదన్నారు. ఇప్పటికే ప్రభుత్వం కూలీలకు ఉపాధి హామీ పనులను దూరం చేసేందుకు రెండు పూటలా ఫొటో ద్వారా మస్టర్ విధానం తెచ్చిందని, దీన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారం చేపట్టాక కూలీలకు పట్టెడన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చి భారాలను పెంచి దానికి తగ్గ వేతనాలను పెంచకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా తొలగించిన సమ్మర్ అలవెన్స్‌తోపాటు సౌకర్యాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషపు ఆశ్రియ్య, సిఐటియు మండల కార్యదర్శి వైఎస్ఎన్.మూర్తి, నేతలు దున్నా మరియమ్మ పాల్గొన్నారు.

ఇరగవరం: కేరళ వామపక్ష ప్రభుత్వం తరహాలో ఉపాధి హామీ కూలీలకు సంక్షేమ నిధి బోర్డు ఏర్పాటు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇరగవరం మండలం రేలంగి పంచాయతీ పరిధిలో గోదావరి అట్టల ఫ్యాక్టరీ సమీపంలో పని చేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనుల ప్రారంభంలో కొంతమందికే ప్రభుత్వం పనిముట్లు ఇచ్చి మిగిలిన వారికి ఇవ్వలేదని, దీంతో సొంత డబ్బు పెట్టి పనిముట్లు కొనుక్కోవాల్సి వస్తుందని కూలీలు వాపోయారు. అనంతరం ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలని కోరుతూ పని ప్రదేశం వద్ద కొద్దిసేపు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు సంక్షేమ పథకాల అమలు కోసం కేరళ వామపక్ష ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ నిధి బోర్డు ఎంతగానో ఉపయోగకరంగా ఉందన్నారు. మన రాష్ట్రంలోనూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కూలీలకు ఉపయోగపడే సంక్షేమ నిధి బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. 200 రోజులు పని కల్పించి రోజు కూలీ రూ.600 ఇవ్వాలని, 30 రోజులు పని పూర్తి చేసిన ప్రతి కుటుంబానికీ చట్టప్రకారం పనిముట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంటా సౌజన్య, చేబ్రోలు సుధారాణి, బూర మాణిక్యాలరావు, గంటా రమేష్, యార్లగడ్డ లలిత, రెడ్డిమిల్లి ధర్మేంద్ర పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ఉపాధి పని ప్రదేశంలో తాగడానికి నీరు, టెంట్లు, మెడికల్ కిట్లు లేకపోవడంతో ఉపాధి కూలీలు చాలా ఇబ్బంది పడుతున్నారని, మహిళలు కూడా పెద్ద గిన్నెల నిండా మట్టి మోయాలని ఆంక్షలు విధించడం సరికాదని, ఈ విధానం మార్చుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు అన్నారు. ఉపాధి పర్యటనలో భాగంగా మంగళవారం మాధవరంలో ఉపాధి పనులను సందర్శించి కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమరాజు, రైతు సంఘం మండల అధ్యక్షులు గుత్తుల నరసయ్య మాట్లాడుతూ ఉదయం ఐదు గంటలకే పని ప్రదేశానికి వెళ్లినా సైట్ సూపర్‌వైజర్ టైముకు కొలత ఇవ్వకుండా 11 గంటల వరకు పని చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానం మారకపోతే కూలీలను సంఘటితం చేసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.రాముడు, ఎం.రామలక్ష్మి, గుత్తుల సత్యవతి, ఎన్.కుమారి, ఎం.సత్తెమ్మ, చినమర్తి పోలయ్య, సిహెచ్.జ్యోతమ్మ, డొంకా దాసు, డొంక రాణి పాల్గొన్నారు.

వీరవాసరం: ఉపాధి కూలీలకు తక్షణం బకాయి వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు డిమాండ్‌చేశారు. పాలకుల దుష్ట విధానాల నుంచి ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం వీరవల్లిపాలెంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం ఫీల్డ్ అసిస్టెంట్ లేదని పనులు చూపించలేకపోతున్నామని అధికారులు చెప్పారని కూలీలు తెలిపారు. అంతకుముందు చేసిన పనులకు కూడా డబ్బులు రాలేదన్నారు. దీనిపై ఆంజనేయులు మాట్లాడుతూ సంవత్సరానికి వంద రోజులు తగ్గకుండా పని చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ప్రతి కుటుంబానికీ జాబ్‌కార్డు ఇవ్వాలన్నారు. చేసిన పనికి డబ్బులు వెంటనే చెల్లించాలని కోరారు. ఉపాధిహామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయకుండా నిధుల్లో కోత విధించి, పని పద్ధతుల్లో మార్పులు చేస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూలీల వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్, టెంట్, తాగునీరు సదుపాయాలు వెంటనే కల్పించాలన్నారు. ఇవేమీ అమలు చేయకుండా పొమ్మనలేక పొగబెట్టే విధంగా పాలకుల తీరు ఉందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవడానికి పోరాటం తప్పదన్నారు. ఈ పోరాటంలో సిఐటియు ప్రత్యక్షంగా పాల్గొని ఉపాధి కూలీలకు అండగా ఉంటుందన్నారు.

పెనుమంట్ర: మాముడూరులో మాట్లాడుతున్న గోపాలన్

పెనుమంట్ర: ఉపాధి హామీ చట్టానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్, జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మాముడూరులో సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలి రూ.600 ఇవ్వాలని, రెండొందల రోజులు పని కల్పించాలని కోరారు. పాత మస్టర్ పద్ధతి కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం 13 మంది ఉపాధి హామీ పోరాట కమిటీని ఎన్నుకున్నారు.

పెనుగొండ: ఉపాధి పని ప్రాంతంలో నిలువ నీడ లేదు.. తాగేందుకు నీళ్లు లేవని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి షేక్ పాదుషా తెలిపారు. వడలిలో నేతలు కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.వెంకటేశ్వరరావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరుకు ప్రతిపాదనలు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల వరిచేలు నేలకొరిగి దెబ్బతిన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండల వ్యవసాయ అధికారి, తహశీల్దార్‌తో కమిటీ, రైతు రైతు భరోసా కేంద్ర సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులతో గ్రామ కమిటీని ఏర్పాటు చేసి రైతు వారీగా పంట దెబ్బతిన్న విస్తీర్ణాన్ని ఎన్యూమరేషన్ చేయడం జరిగిందని తెలిపారు. పంట దెబ్బతిన్న రైతుల జాబితాను సంబంధిత ఆర్‌బికెలో సామాజిక తనిఖీ నిమిత్తం పెట్టామని తెలిపారు. రైతుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని తుది నివేదికలు జిల్లా స్థాయిలో తయారు చేసి పెట్టుబడి రాయితీ మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక పంపించామని తెలిపారు. అత్తిలి, పాలకొల్లు, యలమంచిలి, ఆకివీడు, భీమవరం, వీరవాసరం, ఇరగవరం ఎనిమిది మండలాల పరిధిలో 23 గ్రామాల్లో 157 హెక్టార్ల వరి పంట 33 శాతం కంటే అధికంగా దెబ్బతిందని తెలిపారు. తక్షణం ప్రభుత్వం ద్వారా ఇన్‌పుట్ సబ్సిడీ రూ.23.54 లక్షలు ఎస్‌డిఆర్‌ఎఫ్ నిబంధనల ప్రకారం రాష్ట్ర వ్యవసాయ కమిషనర్‌కు మంజూరు నిమిత్తం పంపించామని తెలిపారు.

విద్యుత్ కోతలు నిరసిస్తూ టిడిపి ధర్నా

ప్రజాశక్తి - పాలకొల్లు

ఇరగవరం : నిరసన తెలుపుతున్న టిడిపి నేతలు

నియోజవర్గంలో విద్యుత్ కోతలు ఆపాలని, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో పట్టణ ఇండోర్ సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఇష్టానుసారం విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు మండు వేసవిలో నానా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే విద్యుత్ కోతలు ఎత్తివేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, నేతలు జివి, పీతల శ్రీను, పెన్మెత్స రామభద్రరాజు, ఇంటి శ్రీరాముడు పాల్గొన్నారు.

ఇరగవరం: పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించి కోతలు లేని కరెంటును ప్రజలకు అందించాలని మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యాన మంగళవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం దాదాపు ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచిందన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టి రైతులను చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గోపిశెట్టి రామకృష్ణ, ఆరేటి రామారావు, చవ్వాకుల సత్యనారాయణ, కునుకు సత్తిబాబు, సుబ్బిరెడ్డి, దత్తు రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలన్నీ పరిష్కరించే వరకూ పోరు

27న ఏలూరులో కృష్ణా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలస్థాయి సదస్సు

ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఏలూరు

అభివాదం చేస్తున్న నేతలు

తమ సమస్యలు పరిష్కరించాలని గత ఫిబ్రవరిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఇచ్చిన లేఖలోని సమస్యలన్నీ పరిష్కరించే వరకూ పోరాటం సాగిస్తామని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. తమ పోరాటం ఫలితంగా ప్రభుత్వం కొన్ని సమస్యలు పరిష్కరించిందని, మిగిలిన సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. తమ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈ నెల 27న ఏలూరులోని టొబాకో మర్చంట్స్ కళ్యాణ మండపంలో నిర్వహించే ప్రాంతీయ సదస్సు జయప్రదానికి మంగళవారం ఆయా సంఘాల నేతలతో స్థానిక రెవెన్యూ భవనంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ గత 73 రోజులుగా చేపట్టిన ఆందోళనా కార్యక్రమాల ఫలితంగా ప్రభుత్వం స్పందించి కొన్ని సమస్యలు పరిష్కరించిందన్నారు. అయితే తాము ప్రస్తావించిన సమస్యలన్నీ పరిష్కరిస్తేనే ఉద్యమ కార్యాచరణ ఆపుతామని స్పష్టం చేశారు. ప్రధానంగా బకాయిపడ్డ నాలుగు డిఎలు, పిఆర్‌సి ఎరియర్స్, పేస్కేల్స్, స్పెషల్ పేలు, విఆర్‌ఎలకు డిఎ, ఉద్యోగోన్నతి పొందిన గ్రేడ్-2 విఆర్‌ఒలకు పేస్కేల్ ఇవ్వడం, విలీనానికి ముందు ఆర్‌టిసిలో పని చేస్తున్న ఉద్యోగులకు పాత సర్వీస్ రూల్స్ వర్తింపజేయడం, హోంగార్డులను ఇతర యూనిఫాం సర్వీస్ శాఖల్లో విలీనం చేయడం, మిగిలిపోయిన తొమ్మిది వందల భాషా పండితుల కోసం సూపర్ న్యూమరరీ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సర్వీస్ రూల్స్ సమస్యలు, వర్క్‌చార్జ్‌డ్ ఉద్యోగుల పేరు ఇంజినీర్ సబార్డినేట్‌గా మార్చి 010 పద్దు కింద జీతాలు, డిఆర్‌డిఎ ఉద్యోగులను పిఆర్‌అండ్ ఆర్‌డి శాఖలో విలీనం, మున్సిపల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, రూరల్ వాటర్ సప్లయి డిపార్టుమెంట్‌లోని ఇంజినీర్లకు డిఇ పోస్టులు మంజూరు తదితర ముఖ్యాంశాలు అన్నింటిపై స్పష్టమైన లిఖితపూర్వక ఉత్తర్వులు వస్తే తప్ప ఈ ఉద్యమం ఆగేది లేదన్నారు. నాలుగు సంవత్సరాలుగా ఈ ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించినప్పటికీ ఉద్యోగులను ప్రభుత్వం పూర్తిగా విస్మరించినందున, తప్పని పరిస్థితుల్లో ఆందోళన చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ ఎంప్లాయీస్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణమోహన్, క్లాస్ ఫోర్ ఎంప్లాయీస్ అధ్యక్షులు మల్లేశ్వరరావు, ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కార్యదర్శి బి.జ్యోతి, ఎపి విఆర్‌ఒ సంఘం రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, డిపిఒ సంఘ రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్, ఎపి జెఎసి అమరావతి ఏలూరు జిల్లా ఛైర్మన్ కె.రమేష్‌కుమార్, కార్యదర్శి ఎ.ప్రమోద్ కుమార్, ట్రేడ్ యూనియన్స్ నాయకులు బండి వెంకటేశ్వరరావు, కృష్ణమాచార్యులు, బి.సోమయ్య, సచివాలయ ఉద్యోగుల నాయకులు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నోటి దగ్గర కూడు లాగేస్తారా

14 రోజుకు రైతుల నిరసన దీక్ష

ప్రజాశక్తి - పాలకోడేరు

నిరసన తెలియజేస్తున్న రైతులు

ఇళ్ల స్థలాలకు భూములిస్తే.. మా నోటి దగ్గర కూడు లాగేస్తారా అంటూ పాలకోడేరు నిరుపేద రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తీసుకున్న భూములకు పరిహారం ఇచ్చేంతవరకూ ఆందోళన కొనసాగిస్తామని, అధికారులు స్పందించి పరిహారం తక్షణం అందించాలని పాలకోడేరు జగనన్న ఇళ్ల స్థలాలకు భూములిచ్చిన రైతులు స్పష్టం చేశారు. పాలకోడేరు జగనన్న లేఅవుట్ స్థలాలకు భూములిచ్చిన రైతులు చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం 14వ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం రైతుల పట్ల అవలంబిస్తున్న విధానాలు అత్యంత దుర్మార్గమని విమర్శించారు. పేదల ఇళ్ల స్థలాల కోసం తామంతా భూములిస్తే ప్రభుత్వం తమను నిలువునా ముంచిందని బాధితులు వాపోయారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు సంబలదీవి సాయిబాబు, నల్లి రామలక్ష్మి, కారంకి సత్యనారాయణ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నేత సుబ్బారావు మృతి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

మండలంలోని మల్లవరం లంక గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకుడు కవురు సుబ్బారావు (70) మంగళవారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సుబ్బారావు సుదీర్ఘకాలం సిపిఎం గ్రామ కార్యదర్శిగా, రైతు సంఘం మండల నాయకునిగా ప్రజల సమస్యలపై, రైతు సమస్యలపై పోరాడి పలు సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. సుబ్బారావు మృతికి సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం సంతాపం తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, నాయకులు ముచ్చర్ల త్రిమూర్తులు, పొన్నాడ రాము, నోముల కొండ, పుగాకు నారాయణరావు, పిల్లి కామేశ్వరరావు, సిఐటియు నాయకులు తెలగంశెట్టి సత్యనారాయణ, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడి శెట్టి రామాంజనేయులు, మత్స్యకారుల సంఘం జిల్లా నాయకులు జల్లి రామ్మోహనరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కాకిలేటి ప్రసాదరావు, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పుగాకు పూర్ణ సుబ్బారావు మృతదేహాన్ని సందర్శించి పార్టీ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

డిగ్రీ సెమిస్టర్‌లో ఛాంబర్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ డిగ్రీ 3వ సెమిస్టర్ ఫలితాల్లో ఛాంబర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అన్ని గ్రూపుల్లో అత్యుత్తమ గ్రేడ్లు సాధించి మరోసారి చరిత్ర సృష్టించారు. బిఎస్‌సి ఫలితాల్లో ఎస్.హేమలత 9.8, జి.స్వాతి 9.7, ఎ.హారిణి, కె.దేవి లావణ్య 9.5 జిపిఎ సాధించారు. అలాగే 30 విద్యార్థులు 9.0 గ్రేడ్ పాయింట్లపైన సాధించారు. బిఎస్‌సిలో 88 శాతం, బికాంలో 86 శాతం, బిబిఎ 84 శాతం పాస్ పర్సంటేజ్ సాధించినట్లు ఛాంబర్స్ కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో కళాశాల ఛైర్మన్ కెవిఆర్ నరసింహరావు, ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు విద్యార్థులను అభినందించారు.

మహిళలకు కుట్టుమిషన్‌పై శిక్షణ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్, శివదేవునిచిక్కాల వారు మహిళలకు కుట్టుమిషన్‌పై శిక్షణ నిర్వహించి వంద మందికి కుట్టుమిషన్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్ నిమ్మల రామారావు చెప్పారు. ఆయన చిక్కాలలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. తెలంగ శివదేవుని ట్రస్ట్ భవనంలో ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థచే శిక్షణ ఇచ్చి అనంతరం కుట్టు మిషను టేబుల్‌తో మోటార్ ఇస్తామని చెప్పారు. ఆసక్తి గల మహిళలు శివ ప్రసాద్ సెల్ 72075 75616 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వైసిపి నేత పెద్దిరాజుకు పివిఎల్ పరామర్శ

ప్రజాశక్తి - ఉండి

గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామానికి చెందిన జనప పెద్దిరెడ్డిని మంగళవారం డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు పరామర్శించి పెద్దిరెడ్డి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ జనప పెద్దిరెడ్డి వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. అటువంటి వ్యక్తి అనారోగ్యం కారణంగా కొంతకాలం నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారని తెలిపారు. పెద్దిరెడ్డి తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పెద్దిరెడ్డిని పరామర్శించిన వారిలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, ఎడిద వెంకటేశ్వరరావు, మున్నలూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాలమర్రులో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని వాలమర్రులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని డాక్టర్ ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి గంటా సత్యనారాయణ మాట్లాడారు. గ్రామస్తులు విలేజ్ హెల్త్ క్యాంపుల ద్వారా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. డాక్టర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ఈ క్యాంపులో బిపి, షుగర్ ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సూపర్‌వైజర్ ఎస్‌కె.అమలేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ తారక సత్య, ఎఎన్ఎం సుజ్ఞానమణి, ఎంఎల్‌హెచ్‌పి యువతేజ పాల్గొన్నారు.

పట్టుదలతోనే విజయం సాధ్యం

ప్రజాశక్తి - తణుకురూరల్

పట్టుదల ఉంటే విజయం సాధ్యమని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు సిహెచ్.రాజు, బిఎం.గోపాల్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ, ఐద్వా, జెవివి, ఎపి ఎంఎస్ఆర్‌యు ఆధ్వర్యంలో జరిగిన సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే 10వ తరగతిలో మంచి మార్కులు వచ్చిన పి.శిరీష, వి.చార్వికకు బహుమతులు అందజేశారు. డ్రాయింగ్ సిహెచ్.దుర్గప్రసాద్, మ్యాథ్స్, మెజీషియన్ బి.ఎంగోపాల్‌రెడ్డి మ్యాజిక్ చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో కె.దేవదత్తు, సిఐటియు నాయకులు అడ్డగర్ల అజయకుమారి, పి.దక్షిణామూర్తి, పివి.ప్రతాప్, గార రంగారావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పెనుగొండ

బాల్య వివాహాలపై అవగాహనా సదస్సు దొంగరావిపాలెం, పెనుగొండలో మంగళవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.విజయకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేయకూడదని, చిన్న వయసులో పెళ్లి చేయడం నేరమని తెలిపారు. బాలికలను బాగా చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వాసవీలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శ్రీవాసవీ డిగ్రీ కాలేజీలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ జాబ్ మేళాకు 118 మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ఎ.కృష్ణారెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. ఈ జాబ్ మేళాలో హెటెరో డ్రగ్స్, టెక్ మహీంద్రా, ఎల్ఐసి కంపెనీలు పాల్గొన్నట్టు తెలిపారు. టెక్ మహీంద్రాలో 30 మంది, హెటెరో డ్రగ్స్‌లో ఆరుగురు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు కళాశాల ఛైర్మన్ నారాయణ రామనారావు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ప్రజాశక్తి - ఆకివీడు

మృతుడు తేజ

మండలంలోని చినకాపవరం రోడ్డులో కోళ్లపర్రు వెళ్లే మార్గంలో వంతెన సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తరటావ గ్రామానికి చెందిన గంగుల తేజ (16) ఆకివీడు వచ్చాడు. సాయంకాలం తిరిగి తన స్వగ్రామానికి వెళ్తుండగా కోళ్లపర్రు నుంచి గుమ్ములూరు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో తేజ తలకు తీవ్ర గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో మృతుని కుటుంబ సభ్యులకు కన్నీరుమున్నీరయ్యారు. తేజ ఇటీవల పదో తరగతి పాసయ్యాడు. విజయవాడలో ఇంటర్‌లో చేర్పించేందుకు కుటుంబ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ లోపే ఈ సంఘటన చోటు చేసుకుంది. ఆకివీడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

చల్లని పానీయాలతో జర జాగ్రత్త..!

జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన

ప్రజాశక్తి - కాళ్ల

వేసవి తాపాన్ని తట్టుకోలేక జనం కూలింగ్ వాటర్ ఎక్కువగా తాగేస్తుంటారు. అయితే ఆ నీరు ఆరోగ్యానికి అంతమంచిది కాదని, మజ్జిగ, నిమ్మ రసం నీరు, కొబ్బరి నీళ్లు, బార్లి వంటివి తీసుకుంటే ఆరోగ్యకరమని వైద్యులు సూచిస్తున్నారు. వేసవి నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కూలింగ్ వాటర్ వినియోగం పెరిగింది. కూలింగ్ వాటర్ గొంతుపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఇన్ఫెక్షన్ల బారిన పడితే గుండె, ఊపిరితిత్తులకు దెబ్బ అని వైద్యులు సూచిస్తున్నారు. కూల్ డ్రింక్స్, ఫ్రిజ్ వాటర్‌కు దూరంగా ఉండాలని చెబుతున్నారు.

కూలింగ్ టిన్నులు

వేసవిలో తాగునీటి విషయంలో ఏ మాత్రమూ అజాగ్రత్తగా ఉన్నా వ్యాధులు చుట్టుముడతాయి. నీరే కదా అనే నిర్లక్ష్యం పనికిరాదని, ముఖ్యంగా అతి చల్లని నీటితో ప్రమాదం పొంచి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం వేసవికాలం నేపథ్యంలో ఫ్రిజ్‌లో నీరు, కూల్ డ్రింక్స్ తాగేందుకు ఆసక్తి చూపుతారు. అయితే అవి ఎక్కువ మోతాదులో తీసుకోవడం హాని కరమని చెబుతున్నారు.

రోజుకు ఎనిమిది లీటర్లు తాగాలి..

ప్రతి రోజూ కనీసం 6 నుంచి 8 లీటర్ల నీరు తాగాలి. శరీరంలోని కాలుష్యాన్ని కడిగేందుకు నీరు ఎంతో ఉపకరిస్తుంది. జాగ్రత్తలు పాటించుకుంటే అదే నీరు ప్రాణాల మీదకు తెస్తుంది. కూలింగ్ వాటర్ గొంతుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పిల్లలకు ఫ్రిజ్ నీరు ఇవ్వకూడదు. కూలింగ్ వాటర్ తాగడం వల్ల ముఖ్యంగా గొంతులోని పొరలు రోగనిరోధక శక్తిని కోల్పోతాయి. ఇన్ఫెక్షన్లు త్వరగా సోకే ప్రమాదం ఉంది. జ్వరం, గొంతు మంట వంటి ఇబ్బందులు వచ్చే ప్రమాదం ఉంది.

చిన్నపిల్లల పట్ల జాగ్రత్తలు తప్పనిసరి..

మూడేళ్ల నుంచి 12 ఏళ్ల వయసు పిల్లలకు గొంతులో ట్రాన్సిల్స్, ఎడినాయిడ్ గ్రంథులు అతిత్వరగా ఇన్ఫెక్షన్‌కు గురవుతుంటాయి. అందువల్ల చల్లని నీటికి దూరంగా ఉండాలి. జ్వరం సమయంలో భోజనం చేసేందుకు గొంతు సహకరించదు. దాదాపు 18 డిగ్రీల సిల్సియస్ కంటే తక్కువ చల్లదనాన్ని గొంతు తట్టుకోవడం కష్టం. గ్లాసు నీరు తాగగానే గొంతులోని రక్తనాళాలు బిగుసుకుపోతాయి. కొద్ది సమయానికి రక్తనాళాలు ఉబ్బి గొంతు గోడల కుండే పొరలు దెబ్బ తింటాయి.

ఈ నియమాలు పాటించాలి

ఎం.గులాబ్ రాజ్ కుమార్, వైద్యాధికారి కాళ్ల

ప్రజలు ఫ్రిజ్ వాటర్, కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. పెరుగు, పండ్లు ఫ్రిజ్‌లో నుంచి తీసిన వెంటనే కాకుండా కాసేపు ఉంచి గరిష్ట ఉష్ణోగ్రతకు చేరాక తీసుకోవాలి. పరిశుభ్రమైన నీరు తాగాలి. కలుషిత నీటివల్ల కలరా, టైఫాయిడ్, అతిసార వంటి సీజనల్ వ్యాధులు ప్రబలుతాయి. అందువల్ల మరగబెట్టి చల్లార్చిన నీటినే తాగాలి. బయటకు వెళ్లేటప్పుడు కూడా వేడి నీరు తీసుకెళ్లడం ఇంకా మంచిది. శరీరానికి నీరు ఎంతో అవసరం. పరిశుభ్రమైన నీరు తీసుకోవాలి.

ప్రభుత్వం, ప్రజల మధ్య వారధులు వాలంటీర్లు

ప్రజాశక్తి - మొగల్తూరు



వాలంటీర్లకు అవార్డులు అందిస్తున్న చీఫ్‌విప్ ప్రసాద్‌రాజు

వాలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి వారధి వంటి వారని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మంగళవారం మండలంలోని పసలదీవి గ్రామంలో సంప్రదాయ కళ్యాణ మండపంలో వరసగా మూడో ఏడాది ఏర్పాటు చేసిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాలంటీర్లు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చెరవేయాలన్నారు. అవినీతి, పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడానికి ప్రభుత్వం వాలంటీర్లు సచివాలయం వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. కరోనా కష్ట కాలంలో వాలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. వాలంటీర్లు తమ పరిధిలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బందితో సమన్వయంతో వ్యవహరించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. నరసాపురం నియోజకవర్గంలో 1086 మంది వాలంటీర్లు ఉండగా వారిలో 1006 మంది వాలంటీర్లకు కోటీ 3 లక్షల 10 వేలు రూపాయలు పురస్కారాలు అందజేసినట్లు తెలిపారు. మొగల్తూరు మండల పరిధిలో 360 మందికి సేవా మిత్ర ఒక్కరికి రూ.10 వేలు, ఐదుగురికి సేవారత్న రూ.20 వేలు, ఇద్దరికి సేవావజ్రా రూ.30 వేల నగదు బహుమతి అందజేశామన్నారు. ఇప్పుడు పురస్కారం పొందలేని వాలంటీర్లు పోటీపడి ఉత్తమ సేవలందించి వచ్చే ఏడాది పురస్కారం అందుకునేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసిలు తిరుమాని బాపూజీ, బొక్కా రాధాకృష్ణ, వైస్ ఎంపిపి కైల సుబ్బారావు, అండే భుజంగారావు, కొల్లాబత్తుల రవికుమార్, కుక్కల కృష్ణమోహన్, కంచర్ల బాబు, సర్పంచులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని సుంకర పద్దయ్య వీధిలోని ఆంజనేయస్వామి మహోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంఎల్‌ఎ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలని సూచించారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 28, 29, 30వ తేదీల్లో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భీమవరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో జరిగే కోస్తాంధ్ర జిల్లాల విద్య, వైజ్ఞానిక, రాజకీయ, సైద్ధాంతిక శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ సుందర్, టి.అప్పలస్వామి తెలిపారు. మంగళవారం భీమవరంలో డిఎన్ఆర్ కళాశాల కూడలిలో ఎఐఎస్ఎఫ్ నాయకులు శిక్షణ తరగతుల కరపత్రాలను పంచి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.మణిదీప్, వై.సంతోష్, యు.మురళి పాల్గొన్నారు.

కంటి వెలుగును ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వైఎస్ఆర్ కంటి వెలుగు ను స్థానికులు ఉపయోగించుకోవాలని పిహెచ్ అగ్రహారం సర్పంచి చుక్కా అప్పారావు అన్నారు. పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన మంగళవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా పిప్పర ఆరోగ్య కేంద్రం డాక్టర్ కె.ప్రియాంక మాట్లాడుతూ కంటిచూపు పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏడాదికోసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. 61 మంది వృద్ధులు కంటి పరీక్షలు చేయించుకోగా వారందరికీ కళ్లజోళ్లుపడతాయని నేత్ర వైద్యులు ఐ.శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గణపవరం సిహెచ్ ఓ.జాలాదివిల్సన్ బాబు, ఎంపిటిసి పి.శివనారాయణ, ఆరోగ్య సహాయకులు నామాల రాజు, కార్యదర్శి డి.రామారావు పాల్గొన్నారు.

వేంద్రలో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - పాలకోడేరు

వేంద్రలో చేపట్టిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు నేతృత్వంలో ఎంపిపి భూపతిరాజు చంటిరాజు ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అమలుపై ఆరా తీశారు. అనంతరం పివిఎల్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్తుంటే ప్రజల్లో మంచి స్పందన కనిపిస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు 98 శాతం పైగా అమలు చేశారని తెలిపారు. వేంద్రలో డ్రెయినేజీ, సీసీ రోడ్ల సమస్యలు ఉన్నాయని చెప్పారని, సచివాలయానికి విడుదలవుతున్న రూ.20 లక్షల నిధులతో త్వరలో పనులు చేపడతామని తెలిపారు. పథకాలన్నీ కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు), ఎంపిటిసి పాల జ్యోతి, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు పెన్మత్స వెంకటరాజు, సర్పంచి కడలి నాగేశ్వరి, ఉప సర్పంచి భూపతిరాజు సుబ్బరాజు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, పెన్మత్స శ్రీనివాసరాజు గొట్టుముక్కల గోపాలకృష్ణంరాజు, వేగి రమణ, బుడితి నాగరాజు, నేలపాటి రాజబాబు, ఎ.శేఖర్, కె.రాంబాబు, బండి సత్యనారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలపై దశలవారీ పోరాటం

ప్రజాశక్తి - వీరవసరం

పంచాయతీ, రైస్ మిల్లు, అంగన్‌వాడీ, ఆశా, మిడ్ డే మీల్స్, విఒఎల సమస్యలపై దశలవారీగా ఆందోళన చేపడుతామని సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు డి.వరలక్ష్మి, పి.నాగరత్నం తెలిపారు. సిఐటియు వీరవాసరం మండల కమిటీ సమావేశం డి.వరలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వివిధ రంగాల కార్మికుల సమస్యలపై చర్చ జరిగింది. రైస్ మిల్ కార్మికులు మిల్లులు సక్రమంగా తిరగక పోవడం వల్ల ఉపాధి కరువైందని, పంచాయతీ కార్మికులు కనీస వేతనాల్లేక సంవత్సరాల తరబడి పనిచేస్తున్న పర్మినెంట్ లేక ఇబ్బందులు పడుతున్నారని సమావేశం అభిప్రాయపడింది. అంగన్‌డీ, ఆశా కార్మికులు పని ఒత్తిడికి గురవుతున్నారని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలన్నింటిపై రానున్న కాలంలో దశల వారీ ఆందోళన చేపట్టాలని సమావేశం నిర్ణయించిందన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు జిల్లా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు పోరాడకపోతే ఉన్న హక్కుల్ని కోల్పోయే పరిస్థితి కనపడుతుందన్నారు. విశాఖ ఉక్కు పై జరుగుతున్న ఆందోళనల్లో సిఐటియు కార్యకర్తలు మరింత చురుగ్గా పాల్గొనాలని నిర్ణయించింది అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీనివాస్, రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.సత్తిబాబు, విఒఎల సంఘం నాయకులు సోని, నిర్మల పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం : పివిఎల్

ప్రజాశక్తి - కాళ్ల

వాలంటీర్లంతా సేవా భావంతో ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడం అభినందనీయమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. మంగళవారం పెదఅమిరంలో క్షత్రియ కళ్యాణ మండపంలో గ్రామ వాలంటీర్లను ఘనంగా సత్కరిం చారు. పెదఅమిరం, జక్కరం, కోపల్లె, బొండాడ, బొండాడు పేట, లక్ష్మి నరసింహపురం, వేంపాడు గ్రామ వాలంటీర్లు 108 మందికి సేవా వజ్ర, సేవ రత్న, సేవా మిత్ర సర్టిఫికెట్స్, మెడల్స్,జ్ఞాపికలను పివిఎల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.స్వాతి, జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, సర్పంచుల ఛాంబర్ జిల్లా అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు, కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు, కలవపూడి సొసైటీ అధ్యక్షుడు పి.దుర్గా ప్రసాదరాజు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పరిసరాల పరిశుభ్రతతో దోమల వ్యాప్తికి అడ్డుకట్ట వేయడంతో పాటు పలు రకాల వ్యాధులను దూరం చేయొచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. వెంకటరామన్నగుడెం, మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని మోదుగుంట, పుల్లాయగూడెం గ్రామంలో జరుగుతున్న వెక్టర్ కంట్రోల్ హైజిన్ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. మోదుగుంటలో డాక్టర్ కె.శైలజ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యపరంగా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజారోగ్యం కోసం వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, శానిటేషన్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు కార్యక్రమంలో నిమగ్నమై ఉండాలన్నారు. ముఖ్యంగా వారంలో ఒక్కరోజు డ్రైడే పాటించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టడానికి అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు హరనాథ్ బాబు, ఇ.కాంతారావు, భాస్కర రావు, ఎంఎల్‌హెచ్‌పిలు, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి పాండురంగ పాల్గొన్నారు.

మహానాడుకు పది బస్సులు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో భీమవరం నియోజవర్గం నుంచి వెయ్యి మంది నాయకులు మహానాడు మహాసభకు తరలి వెళ్లనున్నారు. రాజమండ్రిలోని వేమగిరి వద్ద టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిర్వహించే మహానాడుకు వీరవాసరం, భీమవరం మండలాలు, పట్టణం నుంచి వెళ్లేందుకు 10 ఆర్‌టిసి బస్సులను సరఫరా చేయాలని భీమవరం పట్టణ, మండల, వీరవాసరం మండల అధ్యక్ష కార్యదర్శులు, ముఖ్య నాయకులు ఆర్‌టిసి డిపో వద్ద రీజన్ మేనేజర్‌కు దరఖాస్తు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, కార్యదర్శి గూడూరి సుబ్బారావు, మండల అధ్యక్ష కార్యదర్శులు రేవు వెంకన్న, కౌరు పృథ్వీశంకర్ పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, ప॥గో॥జిల్లా
M.V.O.P. No. 6/2022
బిట్వీన్:
పున్నాని గాంధి -పిటీషనర్
అండ్
ఉదేశి బాలనాగ వెంకట ఆది సాయికుమార్ & Others -రెస్పాండెంట్లు
టు:
R-2: కండిబోయిన రామచంద్ర, S/o. రామకృష్ణ, R/o. 19-25-1/2, 26th Ward, రెడ్డి కాలని, భీమవరం-1, ప॥గో॥జిల్లా.
ఓనర్ ఆఫ్ TATA ACE No: AP 37 TJ 0353 (as per C-Book)
R-3: బొబ్బనపల్లి సోలమాన్, S/o. పోలురాజు, R/o. 9-4-10, బ్రిడ్జి పేట, గునుపూడి, భీమవరం టౌన్, ప॥గో॥జిల్లా.
ఓనర్ ఆఫ్ TATA ACE No: AP 37 TJ 0353 (as per Policy)
మీరు పై తెలిపిన ఎం.వి.ఓ.పి. నెం. 6/2022లో పై తెలిపిన 2 & 3వ ప్రతివాది అయివున్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పై తెలిపిన 3వ భీమవరం అదనపు జిల్లా వారి కోర్టు వారి యొక్క ఉత్తరవు ప్రకారం మీరు **జూన్ నెల 9వ తేదీ 2023వ సం॥రం ఉదయం 10.30 ని॥లకు** హాజరు కావలెను. లేని ఎడల సదరు విషయమై మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 09-06-2023
నిమ్మల వీరవెంకట సత్యనారాయణ సెల్: 9848213165
నిమ్మల నవీన్, సెల్: 8978122722
అడ్వకేట్స్, భీమవరం

వీలునామా పోయినది
తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం మండలం, బొమ్మూరు గ్రామ కాపురస్తులైన కొత్తపల్లి సత్య రవికాంత్, తండ్రి: (లేటు) సూర్యనారాయణమూర్తి తెలియపరుచునది ఏమనగా, నేను బొమ్మూరు గ్రామము నుండి ది. 12-05-2023వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా, పెంటపాడు మండలం, ఆకుతీగపాడు గ్రామమునకు బైకుపై వెళ్లుచూ నా పంట భూమికి సంబంధించిన రిజిస్టర్డ్ ఒరిజినల్ వీలునామా నెం. 28/2018 గల వీలునామాను పెంటపాడులో జిరాక్స్ తీయించి బైక్ బ్యాగ్‌లో పెట్టి ఆకుతీగపాడు వెళ్లుచుండగా మార్గ మధ్యలో ఒరిజినల్ వీలునామా మరియు కొన్ని జిరాక్స్ కాపీలు పడిపోయినవి. కావున పైన తెలిపిన వీలునామా ఎవరికైన దొరికినా ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.
కొత్తపల్లి సత్య రవికాంత్
ఫోన్ నెంబర్: 7793955609

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి (PSCJ), ఏలూరు
ఇ.పి. నెం. 64/2020
ఒ.యస్. నెం. 174/2017
బిట్వీన్:
పెద్ది సునీత -పిటీషనర్/ డిక్రీ హోల్డర్
చల్లా శేషుకుమారి -రెస్పాండెంట్/ జడ్జిమెంటు డెటార్
డిక్రీ హోల్డర్ దాఖలు చేసిన పబ్లికేషన్
పై నెంబరు గల ఇ.పి వారంటు గ్రంథములో శ్రీ కోర్టు వారు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని **ది. 14-06-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** వేలం వేయుదురు. ఆసక్తి ఉన్నవారు సదరు వేలంలో పాల్గొనవచ్చును. పూర్తి వివరములకు డిక్రీ హోల్డర్ ప్లీడరు గారిని సంప్రదించగలరు.
షెడ్యూలు
ఏలూరు జిల్లా, ఏలూరు సబ్ రిజిస్ట్రీ ఇలాక, ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్, గాంధీనగర్, ఇ-వార్డు, టి.ఎస్. నెం. 100/26, 102-6-0 చ॥గ॥ల స్థలం (తూర్పు వైపు) వాసావారి వీధి, ఆర్.ఆర్.పేట, డివిజన్ నెం.37, డో.నెం. 20డి-12-20, 21 డబుల్ పోర్షన్ ఆర్.సి.సి. బిల్డింగ్‌నకు హద్దులు.
తూర్పు: ఏగోటి రాములు గారి స్థలము.
దక్షిణం: మునిసిపల్ రోడ్డు.
పడమర: ఈ ఆస్తి మరియు గుడిపూడి శైలాకుమారి గార్ల సరిహద్దు ఉమ్మడి గోడ.
ఉత్తరం: శానాపతి వెంకటలక్ష్మి గారి స్థలము.
పై హద్దుల మధ్య గల వాటా 102-6-0 చ॥గ॥ల తూర్పు వైపు స్థలం (అనగా 202-6-0 చ॥గ॥ల స్థలములో సగ భాగము) అందలి ఆర్.సి.సి. బిల్డింగ్‌తో సహా.
డిక్రీ హోల్డర్ విలువ: రూ. 20,00,000/-
అమీనా విలువ: రూ. 30,00,000/-
కొటారి క్రిష్ణ కిషోర్
ఏలూరు, అడ్వకేట్, ఏలూరు
13-5-2023 సెల్: 9948438590

In the Court of the Additional Senior Civil Judge, Eluru
O.S. No. 449/2016
Between:
M/s. Ushabala Chits Pvt. Limited, Ameerpet, Hyderabad, Rep. by its Legal Assistant, B.Dasaratha ...Plaintiff
AND
Buragadda Venkata Subba Rao & Others ...Defendants
D-5: Smt. Buragadda Subba Rajya Lakshmi, W/o. Buragadda Venkata Subba Rao, Hindu, Female, aged 85 years, Door No. 22A-2-5, Kesari Talkies, Opp. BSNL Office, Powerpet, Eluru.
D-8: Sri Buragadda Krishna Mohan, S/o. (late) Buragadda Venkata Subba Rao, Hindu, Male, aged 48 years, Door No. 22A-2-5, Kesari Talkies, Opp. BSNL Office, Powerpet, Eluru.
పైన ఉదహరించిన చిట్‌ఫండ్ కంపెనీ వారు వారి చిట్ బాకీ రాబట్టుకునే నిమిత్తము దాఖలు చేసిన పై నెంబరు గల దావా గ్రంథములో శ్రీ కోర్టు వారు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియచేయునది ఏమనగా పై నెంబరు దావా గ్రంథము ది. 14-6-2023వ తేదీన వాయిదా ఉన్నందున మీరు ఆరోజు అనగా **ది. 14-6-2023వ తేదీన ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట మీరు గాని, లేదా మీ అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీ వాదనలు ఏమైనా ఉన్న యెడల దాఖలు చేసుకొనగలరు. అట్లు మీరు హాజరు కాని యెడల కోర్టు వారు పై నెంబరు దావా గ్రంథము మీ పరోక్షమున తీర్మానింపబడునని యిందుమూలముగా తెలియచేయడమైనది.
(మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఉత్తర్వుల ప్రకారము ఈ ప్రకటన యివ్వడమైనది)
ఏలూరు **D.KRISHNA SASTRY**
ది.23-5-2023 Advocate, Eluru

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM
DISPUTE NO. 129 OF 2018
M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 15-169, 1st Floor, NVR Complex, Near Bus Stand, Sathupally, Khammam District, Represented by its Branch Manager Cum Foreman,
.........DISPUTANT
VERSUS
Mr. Sayed Nagoor, & 2 Others
To
Opponent No.1. Sayed Nagoor, S/o. Mastan, Age: 25 years, Occ: Car Driver, R/o. H.No. 4-11, Lalitha Kumari Hospital Road, Sathupally Mandal, Khammam District.
Opponent No.2. Banavathu Mahesh Babu, S/o. Babu Rao, Age: 25 years, Occ: Police Constable-2005, T.Narsapuram Police Station, Chinthalapudi Mandal, R/o. H.No. 7-121, T.Narsapuram Police Station, Chinthalapudi Mandal, West Godavari District.
......OPPONENTS
Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 47,801=00 against you and others and where as the above Arbitration/ Dispute is posted to 06-06-2023 for your appearance.
Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/Arbitrator, Khammam on the above said date at 11:30 AM the matter will be determined setting you exparte.
Chit Arbitrator, Deputy Registrar of Chits, Khammam.